# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశ యువత సంక్షేమమే ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేసారు.
- నీట్ ప్రశ్నా పత్రం లీకేజ్ అంశానికి సంబంధించి చర్చలకు రావాలని విద్యార్థులకు కేంద్ర అణుశక్తి శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ విజ్ఞప్తి చేశారు.
- ఇండో-పసిఫిక్ కు సహకారం చేయడానికి భారతదేశం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.
- హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా ఈరోజు జింబాబ్వేతో జరిగిన తొలి టీ-20 క్రికెట్ మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

======================

దేశ యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే తమకు మరేదీ ముఖ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేసారు. పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజీలకు పాల్పడే నిందితులకు అత్యంత వేగంగా, కఠినమైన శిక్షలు పడేలా చూసేందుకు ప్రత్యేకంగా `ఫాస్ట్ ట్రాక్` కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే ధ్యేయంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ప్రధానమంత్రి హెచ్చరించారు.

======================

ప్రాంతీయ స్థిరత్వానికి.. స్వేచ్ఛాయుత, బహిరంగ, సుసంపన్నమైన ఇండో-పసిఫిక్ సంబంధాలను బలోపేతం చేయడానికి భారతదేశం కట్టుబడి ఉందని విదేశంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. మనీలాలో జరిగిన 21వ తూర్పు

ఆసియాన్ సదస్సు (EAS)లో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... అంతర్జాతీయ జలమార్గాలు సురక్షితంగా, అడ్డంకులు లేకుండా ఉండాలని, పశ్చిమాసియా సంఘర్షణను ముగించడానికి దౌత్యపరమైన చర్చలు అవసరమని చెప్పారు. ప్రపంచ వ్యవస్థ అనిశ్చితంగా, అస్థిరంగా ఉందని, ఇక్కడ పరస్పర ఆధారపడటం, ఉమ్మడి ప్రయోజనాలతో పాటు పోటీతత్వం, వైరుధ్యాలు కూడా సహజీవనం చేస్తున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

=====================

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, విద్యార్థుల ఆందోళనలపై ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నడుమ పార్లమెంట్ కార్యకలాపాలకు ఈరోజు అంతరాయం ఏర్పడింది. విపక్షాల నినాదాలు, ఆందోళనల కారణంగా పార్లమెంట్ ఉభయసభలు రేపటికి వాయిదా పడ్డాయి. లోక్‌సభలో వరుస వాయిదాల అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభం కాగానే, ప్రతిపక్ష సభ్యులు మరోసారి నినాదాలతో సభలో గందరగోళం సృష్టించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రిసైడింగ్ అధికారి దిలీప్ సైకియా విజ్ఞప్తి చేసినప్పటికీ, విపక్షాల ఆందోళనలు కొనసాగడంతో ఆయన సభను రేపు ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యసభలోనూ ఇదే విధమైన ఉత్కంఠ వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం 3 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనప్పుడు, నీట్ అంశంపై ప్రతిపక్షాలు మళ్లీ నిరసనలకు దిగాయి. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీ నీట్ అంశంపై కేవలం నిరసనలు తెలుపుతోందే తప్ప, చర్చకు ముందుకు రావడం లేదని విమర్శించారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభను నడిపించేందుకు ప్రయత్నించినప్పటికీ విపక్షాల గందరగోళం మధ్య సభను రోజంతా వాయిదా వేయాల్సివచ్చింది. కేంద్ర మంత్రి, రాజ్యసభ పక్ష నేత జగత్ ప్రకాష్ నడ్డా ప్రతిపక్షాల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. విపక్షాల ప్రవర్తన అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు. సభలో చర్చ జరగడం కానీ, సభ సజావుగా సాగడం కానీ విపక్షాలకు ఇష్టం లేదని ఆరోపించారు. `మొదట్లో కాంగ్రెస్ పార్టీ నీట్‌పై చర్చ కావాలని డిమాండ్ చేసింది, దానికి ప్రభుత్వం కూడా సిద్ధమని ప్రకటించింది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ మాట మార్చి, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలంటూ కొత్త నిబంధనలు పెడుతోందని జేపీ నడ్డా విమర్శించారు.

=====================

నీట్ ప్రశ్నా పత్రం లీకేజ్ అంశానికి సంబంధించి చర్చలకు రావాలని విద్యార్థులకు కేంద్ర అణుశక్తి శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ విజ్ఞప్తి చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులతో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ ఆందోళనలను విరమించి చర్చలకు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడిన కేంద్రమంత్రి, గత 24 గంటల్లోనే నిరసనకారుల ప్రతినిధులకు ప్రభుత్వం తరఫున నాలుగు సార్లు చర్చల ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. ఆందోళన బాట పట్టిన యువతకు తాము బహిరంగ ఆహ్వానం పలుకుతున్నామని, ఈ చర్చల్లో కేంద్రమంత్రి జేపీ నడ్డాతో పాటు తాను కూడా పాల్గొంటానని ఆయన తెలిపారు. చర్చలు లేకుండా ఎలాంటి సమస్యకూ పరిష్కారం దొరకదని ఆయన ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 136వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

=====================

ఆంధ్రప్రదేశ్‌లో 679.71 కోట్ల రూపాయలతో 42 వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు ఆమోదం లభించిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ నుండి కదిరి వరకు ఉన్న జాతీయ రహదారి-42 విస్తరణ, బలోపేత పనుల కోసం 679.71 కోట్లు రూపాయలు మంజూరయ్యాయని సామాజిక మాధ్యమం వేదికగా ఈరోజు వెల్లడించారు. ప్రస్తుతం పేవ్డ్ షోల్డర్స్‌తో కూడిన 2 వరుసల రోడ్డుగా ఉన్న ఈ రహదారిని, పేవ్డ్ షోల్డర్స్‌తో కూడిన 4 వరుసల హైవేగా ఆధునీకరించనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలతో పాటు కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు `బెంగళూరు–విజయవాడ–కోల్‌కతా (BKV) ఎక్స్‌ప్రెస్‌వే`తో పాటు తిరుపతి, చెన్నై నగరాలకు నేరుగా, ఎలాంటి అంతరాయం లేని రవాణా సౌకర్యం లభించనుంది.

======================

నీట్ ప్రశ్నా పత్రం లీకేజీ అంశంపై పార్లమెంటులో చర్చించి.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమర్థవంతమైన విధానాన్ని రూపొందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. నిందారోపణలు చేసుకోవడం, లక్ష్యాలను నిరంతరం మార్చడం వంటివి మానుకుని.. పేపర్ లీకేజీ వంటి తీవ్రమైన సమస్యపై ప్రతిపక్ష పార్టీలు అర్థవంతమైన పార్లమెంటరీ చర్చలో పాల్గొనాలని అన్నారు. ప్రశ్నా పత్రాల లీకులు ఏ ఒక్క ప్రభుత్వానికో లేదా రాజకీయ పార్టీకో పరిమితమైన సమస్య కాదని, ఇది జాతీయ ఆందోళన అని అన్నారు. ఈ సమస్యపై నిజాయితీతో కూడిన చర్చ జరగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయంపై లోతైన చర్చ జరగడానికి పార్లమెంట్ అత్యంత అనువైన వేదిక అని జెపీ నడ్డా పేర్కొన్నారు.

======================

గత తొంభై తొమ్మిది సంవత్సరాలలో ప్రసారరంగం రేడియో నుండి టెలివిజన్‌కు, ప్రస్తుతం డిజిటల్ స్ట్రీమింగ్‌కు పరిణామం చెందిందని ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది పేర్కొన్నారు. జాతీయ ప్రసార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఈరోజు `ఆకాశవాణి`తో మాట్లాడుతూ... దేశ విదేశాల్లోని వీక్షకులు, శ్రోతల కోసం ప్రసార భారతి అన్ని రకాల వినోదాత్మక, సమాచార, విద్యాపరమైన కంటెంట్‌ను నిరంతరం అందిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రసార భారతి ఇటీవల ప్రారంభించిన ఓటీటీ (OTT) ప్లాట్‌ఫామ్ `వేవ్స్` ఇప్పటికే సుమారు కోటి 10 లక్షల మంది ఖాతాదారులను సొంతం చేసుకుందని, ఇది అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని హర్షం వ్యక్తం చేశారు. అందుబాటులోకి వస్తున్న సరికొత్త అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ.. ప్రేక్షకులకు నాణ్యమైన కంటెంట్‌ను అందించేందుకు ప్రసారభారతి నిరంతరం కృషి చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

======================

జింబాబ్వేతో మూడు టీ-20ల సిరీస్‌లో భాగంగా హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా ఈరోజు జరిగిన తొలి క్రికెట్ మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారత్ బ్యాట్స్‌మెన్లు వైభవ్ సూర్యవంశీ 50, ఇషాన్ కిషన్ 35 పరుగులతో రాణించారు.

======================

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఈరోజు 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్-2026 క్రీడా పోటీలను కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్‌లో క్రీడలకు 4 వేల 480 కోట్ల రూపాయలు కేటాయించి.. దేశంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

======================
======================